27 నుంచి యువతకు పారిశ్రామిక శిక్షణ

అరసవల్లి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్లలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 27 నుంచి 30 వరకు నిరుద్యోగ యువతకు ఔత్సాహిక పారిశ్రామిక శిక్షణ నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణలో వ్యాపారం ప్రారంభించడానికి కావాల్సిన ప్రాథమిక అంశాలు, పరిశ్రమల అనుమతులు, బ్యాంకుల నుంచి రుణాలు, ముద్రా, పీఎంఈజీపీ రుణాలపై అవగాహన కల్పిస్తామన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్ అందిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 79891 77887 నెంబరులో సంప్రదించాలని కోరారు.





తుఫాన్.. గుబులు

● మెళియాపుట్టి మండలం జంతూరు గ్రామానికి చెందిన గవిరేషు, జి.రామన్న ఇటీవల వరినూర్పులు చేసి.. కళ్లాల్లో ధాన్యం నిల్వ చేశారు. మంగళవారం సాయంత్రం చిరుజల్లులు కురవడంతో.. ఇలా కళ్లాల్లో నిల్వ చేసిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించేందుకు ఆపసోపాలు పడ్డారు. రాత్రి 7.30 గంటల వరకూ వాటిని బస్తాల్లో నింపి ఇళ్లకు తరలించారు.

● నరసన్నపేట పట్నం నక్కవీధికి చెందిన తంగి అప్పన్న.. ఇటీవల హార్వెస్టర్‌తో వరిపంట నూర్పులు చేశారు. నరసన్నపేట కంబకాయి జంక్షన్ వద్ద సర్వీసు రోడ్డుపై ధాన్యాన్ని ఆరబోశారు. తుఫాన్ ప్రభావంతో మంగళ వారం చిరుజల్లులు కురవడం తో ఆరబోసిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు కుటుంబ సభ్యులతో సహా అప్పన్న ఇలా అవస్థలు పడుతున్నారు.

● జిల్లావ్యాప్తంగా వర్షం ● అన్నదాతల్లో ఆందోళన

● ధాన్యం భద్రపరిచేందుకు అవస్థలు

నరసన్నపేట/మెళియాపుట్టి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వరుస తుఫాన్‌లు.. రైతులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మంగళవారం ఉదయం వాతావరణంలో మబ్బులు కమ్ముకున్నాయి. సాయంత్రానికి జిల్లాలో పలుచోట్ల వర్షం కురిసింది. దీంతో అన్నదాతలో అలజడి రేగింది. పంట చేతికి అందివచ్చిన సమయంలో తుఫాన్ల ప్రభావంతో నష్టం తప్పేలా లేదని వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 3.65 లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారు. ఇప్పటికే 80శాతం కోతలు పూర్తయ్యాయి. వరుస తుఫాన్ల కారణంగా పంట కోతలు కొంత ఆలస్యమయ్యాయి. 47శాతం మేరకు నూర్పులు జరగ్గా.. తుంపర, లోతట్టు ప్రాంతాల్లోని పొలాల్లో వరిపనలు కుప్పలు పెట్టారు. పదిహేను రోజుల వ్యవధిలో వరుసగా మూడుసార్లు తుఫాన్ ప్రభావంతో.. పండే పంటను దక్కించుకునేందుకు అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. మంగళవారం కూడా వర్షం కురవడంతో ధాన్యం భద్రపరిచేందుకు పాట్లు పడ్డారు. నరసన్నపేట, నందిగాం, వజ్రపుకొత్తూరు, పలాస, ఇచ్ఛాపురం, మందస, సంతబొమ్మాళి,పోలాకి, జలుమూరు , శ్రీకాకుళం రూరల్, ఆమదాలవలస, ఎల్.ఎన్.పేట, సరుబుజ్జిలి తదితర మండలాల్లో ఇంకా 37,598ఎకరాల్లో ఇంకా వరి కోతకు ఉన్నట్లు సమాచారం. మరోవైపు మిల్లులకు చేరిన ధాన్యం ఆరుబయటే ఉండటంతో మిల్లర్లలో గుబులు ప్రారంభమైంది. వర్షంలో ధాన్యం తడిస్తే.. మొక్కలు మొలిసే అవకాశం ఉందని, రంగుమారి బియ్యం దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని మిల్లర్లు సైతం ఆందోళన చెందుతున్నారు.

మరిన్ని వివరాలు - 6లో

రైతులు అప్రమత్తంగా ఉండాలి: జేసీ

శ్రీకాకుళం కలెక్టరేట్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): 'జిల్లాలో బుధవారం నుంచి నాలుగు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ధాన్యం తడిచిపోకుండా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాల'ని జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. 'వర్షాల నేపథ్యంలో ధాన్యం తడిచిపోకుండా ఉండేందుకు ప్రతీ మండలంలో 100 టార్పాలిన్లు తహసీల్దార్ల ఆధీనంలో అందుబాటులో ఉంచాం. అవసరమైన రైతులు.. మళ్లీ వాపసు తీసుకునేలా రైతుసేవా కేంద్రాల వద్ద టార్పాలిన్ కోసం రూ.650 చెల్లించాలి. ధాన్యాన్ని తాత్కాలికంగా భద్రపరుచుకునేందుకు దగ్గరలోని ప్రభుత్వ భవనాలు లేదా మార్కెట్ యార్డులను కూడా వినియోగించుకోవచ్చ'ని జేసీ తెలిపారు.

సమాచారం

నేటి నుంచి డిపార్ట్‌మెంట్ పరీక్షలు

● మూడు కేంద్రాల్లో నిర్వహణకు ఏర్పాట్లు

● జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు

శ్రీకాకుళం కలెక్టరేట్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాఖాపరమైన పరీక్షలు ఈ నెల 18 నుంచి 23 వరకు నిర్వహించనున్నట్టు జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు తెలిపారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. డీఆర్వో మాట్లా డుతూ 'డిపార్ట్‌మెంట్ పరీక్షల కోసం జిల్లాలోని శ్రీ శివానీ కళాశాల (చిలకపాలెం), శ్రీ వేంకటేశ్వర కళాశాల(ఎచ్చెర్ల), కోర్ టెక్నాలజీ (నరసన్నపేట) కళాశాలల్లో కేంద్రాలను ఏర్పాటు చేశాం. 1,831 మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు జరుగుతాయి. పరీక్షా కేంద్రాలకు ఒక గంట ముందుగా అభ్యర్థులు చేరుకోవాలి. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురాకూడదు. గుర్తింపు కార్డులు తప్పనిసరిగా ఉండాలి' అని సూచించారు. అలాగే ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేయాలని, విద్యుత్తు అంతరాయం లేకుండా చూడాలని తెలిపారు. సమావేశంలో ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ వెంకటలక్ష్మి, సెక్షన్ అధికారి ఎం.అమ్మాజీ, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీకాంత్, సీఐ దేవరకొండ ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ఆయా కళాశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.

గంజాయిపై పటిష్ఠ నిఘా

● మాదకద్రవ్యాల రహిత రాష్ట్రమే లక్ష్యం

● ఈగల్ టాస్క్‌ఫోర్స్‌తో పూర్తిస్థాయి చర్యలు

● అంతర్రాష్ట్ర సమావేశాలతో సత్ఫలితాలు: డీఐజీ గోపినాథ్ జెట్టి

శ్రీకాకుళం క్రైం/ కోటబొమ్మాళి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయి రవాణా, క్రయవిక్రయాల నిర్మూలనకు పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టి ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం శ్రీకాకుళం నగరంలోని వన్‌టౌన్, కోటబొమ్మాళి పోలీసుస్టేషన్లను ఎస్పీ మహేశ్వరరెడ్డితో కలిసి ఆయన సందర్శించారు. స్టేషన్లలో రికార్డులు పరిశీలించారు. కేసుల నమోదుపై ఆరా తీశారు. అనంతరం డీఐజీ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల రహిత ఆంధ్రప్రదేశ్‌గా రూపొందించేందుకు ఈగల్ టాస్క్‌ఫోర్స్ విభాగాన్ని ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో చర్యలు చేపడుతున్నామని తెలిపారు. 'గంజాయి నియంత్రణలో భాగంగా విశాఖ రేంజ్ పరిధిలో 8.5వేల ఎకరాల సాగు నేలను డ్రోన్లతో పరిశీలించాం. ఇప్పటివరకూ 41 ఎకరాల్లో గంజాయి సాగు చేస్తున్నట్టు గుర్తించాం. ఆ ప్రాంతాల్లో సాగు జరగకుండా చర్యలు చేపడుతున్నాం. గంజాయిని అరికట్టేందుకు నిర్వహిస్తున్న అంతర్రాష్ట్ర సమన్వయ సమావేశాలు సత్ఫలితాలిస్తున్నాయి. ఎన్నో ముఖ్యమైన కేసులను అక్కడి పోలీసుల సహకారంతో ఛేదిస్తున్నామ'ని డీఐజీ వివరించారు. 'సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. సర్కిల్ పరిధిలో గడిచిన మూడేళ్లలో సైబర్ నేరాలపై 19 కేసులు నమోదయ్యాయి. వీటిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నాం. సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రచారాలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేస్తామ'ని డీఐజీ హెచ్చరించారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని తీర్చిదిద్దేందుకు కళాశాల, పాఠశాల విద్యార్థులకు సంకల్పం పేరిట రోజూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

● మహిళా పోలీసులు భాగస్వామ్యం కావాలి

శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో క్రియాశీలకం పేరిట సచివాలయం మహిళ పోలీసులతో నిర్వహించిన కార్యక్రమంలో వారితో డీఐజీ ముఖాముఖి మాట్లాడారు. జిల్లాలో నేర నియంత్రణలో సచివాలయం మహిళ పోలీసులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 'గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాల నివారణపై దృష్టి సారించాలి. లోన్‌యాప్, సైబర్, డిజిటల్ అరెస్టులు, మహిళలు-బాలికలపై వేధింపులు, సోషల్ మీడియా నేరాలపై వివరాలు క్షేత్రస్థాయిలో సేకరించాల్సిన బాధ్యత మహిళ పోలీసులదే. ఇలాంటి నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించి అప్రమత్తం చేయాలి. గ్రామ, వార్డుస్థాయిలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు, చట్ట వ్యతిరేక కలాపాలపై పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించాలి' అని డీఐజీ స్పష్టం చేశారు. అలాగే ట్రాఫిక్‌పై ప్రజలను అప్రమత్తం చేసేందుకు సూచనలతో కూడిన సౌండ్‌బాక్స్‌లను శ్రీకాకుళంలోని సర్కిల్ కార్యాలయంలో ఆయన ప్రారంభించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు యంత్రాంగం కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమం లో డీఎస్పీలు సీహెచ్.వివేకానంద, మూర్తి, సీఐలు పైడపునాయుడు, కె.శ్రీనివాసరావు, శ్రీకాకు ళం, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, నౌపడ ఎస్ఐలు ఎం.హరికృష్ణ, వి.సత్యనారాయణ, సింహా చలం, జి.నారాయణస్వామి, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీకాకుళం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఐజీ గోపినాథ్ జెట్టి

● మొబైల్‌లో మాట్లాడుతూనే డ్రైవింగ్

● జిల్లాలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు

● అతితక్కువగా హెల్మెట్ల వినియోగం

● తలకు గాయాలై.. ప్రాణాలు కోల్పోతున్న వైనం

ప్లీజ్.. హెల్మెట్ ధరించండి



శ్రీకాకుళంలో హెల్మెట్‌లు ధరించకుండా వాహనాలు నడుపుతున్న దృశ్యం

శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి):

జిల్లాలో ఏటా రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది. పదుల సంఖ్యలో మరణాలు చోటు చేసుకుంటున్నాయి. ఎంతోమంది క్షతగాత్రులుగా మారుతున్నారు. రోడ్డు ప్రమాదాల్లో తలకు గాయాలై మరణించిన వారే అధికంగా ఉంటున్నారని నేషనల్ క్రైమ్ బ్యూరో రికార్డు నివేదికలో వెల్లడైంది. ప్రతిరోజూ హెల్మెట్ వాడటంతో తల వెంట్రుకలు రాలిపోతున్నాయని, తల వేడికి గురౌతుందని ద్విచక్ర వాహన చోదకులు శిరస్త్రాణాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. అలాగే మరి కొందరు ఫోన్‌లో మాట్లాడుతూ.. డ్రైవింగ్ చేయడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. నేటి యువత వేగానికిచ్చిన విలువ ప్రాణాలకు, హెల్మెట్ ధరించేందుకు ఇవ్వడం లేదు. దీనిపై హైకోర్టు కూడా ఆగ్రహం వ్యక్తం చేసింది. అయినా చాలామంది ద్విచక్ర వాహనదారుల్లో మార్పు రాకపోవడం గమనార్హం.

కొన్ని ఉదాహరణలు..

● ఎచ్చెర్ల మండలం కొత్తపేట గ్రామానికి చెందిన బొడిగి గోవిందరావు, ఉమాదేవి దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె మౌనిక నాలుగేళ్లగా శ్రీకాకుళం నగరంలోని రైతుబజార్ సచివాలయంలో వీఆర్వోగా పని చేస్తూ తల్లిదండ్రులకు అండగా ఉంటుంది. గతేడాది నవంబరు 23న విధుల్లో భాగంగా సచివాలయం నుంచి బయలుదేరి తహసీల్దార్ కార్యాలయానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా పాలకొండ రోడ్డులోని ఇన్‌కమ్ ట్యాక్స్ కార్యాలయం సమీపంలో ఓ యువకుడు బైక్‌పై వేగంగా వస్తూ మౌనికను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మౌనిక తలకు తీవ్రగాయం కావడంతో ఆమె కోమాలోకి వెళ్లిపోయింది. బ్రెయిన్ డెడ్ అయ్యినట్లు వైద్యులు నిర్ధారించారు.

● మందస మండలం మధ్య దేవపురం గ్రామానికి చెందిన నెయ్యిల రమేష్ కాశీబుగ్గలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో కాంపౌండర్‌గా పని చేస్తున్నాడు. విధుల్లో భాగంగా గతేడాది నవంబరు 29న తన ద్విచక్ర వాహనంపై ఆస్పత్రికి వెళ్తుండగా కోసంగిపురం జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఐదేళ్లలోపు ఇద్దరు పిల్లలు ఉన్నారు. రమేష్ మరణించడంతో ఆ కుటుంబానికి ఆధారం లేకుండాపోయింది.






● శ్రీకాకుళం మహాలక్ష్మీనగర్ కాలనీకి చెందిన చాణక్య అనే యువకుడు ప్రభుత్వ ఉద్యోగి. ఈ ఏడాది అక్టోబరు 22న రాత్రి టీ తాగేందుకు 80 అడుగుల రోడ్డులో ఉన్న దుకాణానికి వెళ్లాడు. అక్కడ తన స్నేహితుడి ద్విచక్ర వాహనం పట్టుకొని రైడ్‌కు వెళ్లాడు. కొద్ది దూరం వెళ్లగానే ముందు వెళ్తున్న కారును వెనుక నుంచి అతివేగంగా వచ్చి ఢీకొట్టాడు. రోడ్డుపై పడిపోయిన చాణక్య తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి తల్లి మాత్రమే ఉంది. కొడుకు మరణించడంతో ఆ తల్లికి దిక్కు లేకుండా పోయింది.

● నరసన్నపేట మండలం బాలసీమ గ్రామానికి చెందిన ఆరంగి చాణక్య ఈ నెల 5న బైక్‌పై విశాఖపట్నం వెళ్తుండగా పూసపాటిరేగ వద్ద జాతీయ రహదారిపై కారు ఢీ కొట్టింది. రోడ్డు మీద పడి (మిగతా 6వ పేజీలో...)

రోడ్డు ప్రమాదాలు	మరణాల సంఖ్య	డ్రంకెన్ డ్రైవ్	ఈ చలానా	కేసులు	అపరాధ రుసుం వసూలు (రూ.లలో)
2020	97	5	393	30,505	1,89,97,250
2021	122	7	5	39,322	1,23,43,855
2022	132	9	548	61,656	1,31,30,670
2023	101	8	1,205	20,124	84,93,720
2024 (నవంబరు)	63	8	96	14,673	88,25,790

సిక్కోలును కమ్మేసిన పొగమంచు

శ్రీకాకుళం అర్బన్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొద్ది రోజుల నుంచీ చలి తీవ్రత పెరిగిపోయింది. మంగళవారం సిక్కోలును పొగ మంచు కమ్మేసింది. శ్రీకాకుళంలో ఉదయం 7గంటల వరకు మంచు కురవడంతో ప్రజలు వణికిపోయారు. మంచు కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు అవస్థలు పడ్డారు. అలాగే సాయంత్రం 5 గంటల నుంచే చల్లటిగాలులు వీస్తూ.. వర్షపు జల్లులు కురవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



ఎవరో?

● టీడీపీ నేత హత్యకు సుపారీపై చర్చ

● ఉలిక్కిపడిన జంట పట్టణాలు

పలాస, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజుని హతమార్చేందుకు కొంతమంది వైసీపీ నాయకులు బీహారీ గ్యాంగ్‌కు సుపారీ ఇచ్చి.. రప్పించడం సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. గతంలో వ్యక్తిగత, రాజకీయ కక్షలు ఉంటే ఈ ప్రాంతంలో స్థానికంగానే పరిష్కారం జరిగేవి. అలజడులు ఉన్నా సొంత బలగంతోనే దాడులు కొనసాగేవి. అయితే ప్రస్తుతం పొరుగు రాష్ట్రాల నుంచి నగదు ఇచ్చి కిల్లర్లను రప్పించడం చర్చనీయాంశమవుతోంది. వైసీపీ నాయకుల బరితెగింపు వెనుక ఎవరు ఉన్నారు?, వారి ఉద్దేశాలు ఏమిటన్న చర్చ సాగుతోంది. సామాజిక మాధ్యమాల్లో సైతం ఈ సంఘటన వెనుక ఉన్న శక్తులు ఎవరు..? అనే రకరకాల ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

● సార్వత్రిక ఎన్నికల నుంచి మొన్న జరిగిన నీటి సంఘాల ఎన్నికల వరకూ బడ్డ నాగరాజు కీలకంగా వ్యవహరించారు. సుపారీ గ్యాంగ్ మధ్య స్వల్ప కొట్లాటతో పోలీసులకు వారు చిక్కడంతో.. అసలు వ్యవహారం బయట పడింది. దీంతో పోలీసులు సైతం ఉలిక్కి పడ్డారు. మొత్తం గ్యాంగ్‌ను పట్టుకొని ప్రశ్నించడంతో వైసీపీ నాయకుల బండారం బయట పడింది. రెండు రోజుల కిందట వైసీపీకి చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకొని రహస్య ంగా పోలీసులు విచారణ చేశారు. సోమవారం రాత్రి కూడా మరో ముగ్గుర్ని అదుపులోకి తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై కాశీబుగ్గ పోలీసులు స్పష్టమైన సమాచారం ఇవ్వడం లేదు. కాగా.. సుపారీ వ్యవహారంపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పందించి పోలీసులకు ఆదేశాలు జారీచేయడంతో ముమ్మర దర్యాప్తు సాగుతోంది. టీడీపీ నాయకుడు హత్యకు కుట్ర వెనుక అసలు సూత్రధారుల కోసం పోలీసుల అన్వేషణ ప్రారంభమైంది.

అన్నదాతలో అలజడి

- భయపెడుతున్న అల్పపీడనం
- జిల్లాలో మారిన వాతావరణం
- పలుచోట్ల చిరుజల్లులు
- ధాన్యం తడుస్తాయని ఆందోళన
- పంటను కాపాడుకునేందుకు పాట్లు



పలాస రూరల్: సుబ్బుగుడ్డిలో కుప్పలు వేస్తున్న రైతుకూలీలు



హరిపురం: వీజీపురం వరిచేను కుప్పలు పెడుతున్న అన్నదాతలు..

హరిపురం/పలాసరూరల్/ నందిగాం, జలుమూరు/టెక్కలి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి)

బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడంతో వాతావరణంలో తీవ్ర మార్పులు చోటుచేసుకున్నాయి. దీంతో జిల్లాలో మంగళవారం ఉదయం నుంచే ఆకాశం మేఘావృతమైంది. సాయంత్రం నుంచి చిరుజల్లులు పడుతుండడంతో అన్నదాతల్లో అలజడి రేగుతోంది. వరిపంట చేతికంది వచ్చే సమయంలో అకాల వర్షాలు వారిని కంటి మీద కునుకు లేకుండా చేస్తోన్నాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంట పొలాల్లో ఉండిపోవడంతో దాన్ని సంరక్షించుకోడానికి పడరాని పాట్లు పడుతున్నారు. కొంతమంది రైతులు పొలాల్లోనే వరి ఓదెలను కుప్పలుగా పెడుతున్నారు. మరికొందరు కూలీలతో కళ్లాలకు మోపులు ద్వారా తరలిస్తున్నారు. ఇంకొందరు ట్రాక్టర్లు, నాటుబండ్లతో కళ్లాలకు తరలించి సంరక్షించుకుంటున్నారు. మందస మండలంలోని బిన్నల, మఖరజోల, మందస, ఉమాగిరి, పితాతొళి, సిరిపురం తదితర గ్రామాల్లో ముమ్మరంగా కోతలు అవుతుండగా, వరిచేను పొలాల్లోనే ఉంది. వాటిని పొలాల్లోనే కుప్పలు పెట్టి తడిసిపోకుండా కాపాడుకుంటున్నారు. హరిపురం, బాలిగాం, కొత్తపల్లి, కుంటికోట, జీఆర్ పురం, పొత్తంగి తదితర గ్రామాల్లో అధిక శాతం కోతలు, నూర్పులు పూర్తయ్యాయి. ధాన్యం తడిగా ఉండటంతో కొనుగోళ్లు జరగడంలేదు. దీంతో కళ్లాల్లోనే ధాన్యం ఉండేపోవడంతో దైన్య పరిస్థితిని రైతులు ఎదుర్కొంటున్నారు. పలాస మండలంలోని సుబ్బుగుడ్డి, రెంటికోట, కాంట్రగడ, సున్నాడ, రామకృష్ణాపురం, మాకనపల్లితో పాటు గిరిజన ప్రాంతాలైన దానగొర, హిమగిరి, సిరిపురం ప్రాంతాల్లో ఇప్పటికే కోత పూర్తయ్యాయి. మోత పను లు మొదలవుతున్న వేళ అల్పపీడనంతో వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



హరిపురం: కొండలోగాం వద్ద ధాన్యం బస్తాలపై గడ్డి కప్పిన దృశ్యం



నందిగాంలో పడుతున్న వర్షం



టెక్కలిలో యంత్రంతో నూర్పు చేస్తున్న రైతులు



జలుమూరులో ట్రాక్టర్‌కు వరి చేను ఎక్కిస్తున్న దృశ్యం

ఆయన పాట.. తెల్లదొరల గుండెల్లో తూటా

- కలం పట్టి ఆంగ్లేయులపై పోరాటం
- మాకొద్దీ తెల్లదొరతనం పాటతో స్వాతంత్ర్య ఉద్యమానికి ఊపు
- నేడు జాతీయ గేయకవి గరిమెళ్ల వర్ధంతి

(పోలాకి)

ఆయన పాటలు ఆంగ్లేయుల గుండెల్లోకి తూటాల్లా దూసుకెళ్లాయి. తన గేయాలతో తెల్లదొరల అరచకాలను ఎండగట్టారు. ఊరూవాడా స్వాతంత్ర్య ఉద్యమాన్ని రగిల్చారు. మాకొద్దీ తెల్లదొరతనం పాటతో బ్రిటిష్ పాలకుల గుండెల్లో రైళ్లు పరుగెట్టేలా చేశారు. ఆయనే జాతీయ గేయకవి గరిమెళ్ల సత్యనారాయణ. బుధవారం ఆయన వర్ధంతి సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం. శ్రీకాకుళం జిల్లా పోలాకి మండలం ప్రియాగ్రహారంలో 1893 జూలై 15వ తేదీన సూరమ్మ, వెంకటనరసింహం దంపతులకు గరిమెళ్ల జన్మించారు. ప్రాథమిక విద్య స్వగ్రామంలో, ఉన్నత విద్య విజయనగరం, మచిలీపట్నం, రాజమండ్రిలో సాగింది. గంజాం కలెక్టరేట్‌లో గుమస్తాగా, విజయనగరం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేశారు.

స్వాతంత్ర్య స్ఫూర్తి..

1920 డిసెంబరులో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ మహా సభలో సహాయ నిరాకరణ ఉద్యమ తీర్మానం ఆమోదిం చారు. ఆ వీరావేశంతో ఉద్యమానికి తన కలంతో మాకొద్దు ఈ తెల్లదొరతనమంటూ అనే గేయం రాసి స్ఫూర్తిని చ్చారు. ఈ గేయానికి అప్పటి బ్రిటిష్ కలెక్టర్ బ్రేకస్ దొర ఆగ్రహం వ్యక్తం చేస్తూ గరిమెళ్లకు ఏడాది పాటు కారాగార శిక్ష విధించారు. జైల్లో ఉండగా తన తండ్రి 1923లో చనిపోగా, పంపించాలంటే క్షమాపణ చెప్పాలని కలెక్టర్ చెప్పినా... అందుకు నిరాకరించి జైల్లోనే ఉండి పోయిన గొప్ప దేశభక్తుడు గరిమెళ్ల.

గరిమెళ్ల రచనలు..

గరిమెళ్ల 1921లో స్వరాజ్య గీతాలు, 1923లో హరిజన పాటలు 1926లో ఖండకావ్యాలు, భక్తిగీతాలు, బాల గీతాలు, 1937లో చీనా జపాన్ పుస్తకం రాశారు. పత్రికా సంపాదకులుగా, ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా పనిచేస్తూ ఆలిండియా రేడియోకు రచనలు చేశారు. ఒకవైపు పేదరికం మరో వైపు అనారోగ్యం బారినపడ్డారు. పక్షవాతం వచ్చి మద్రాస్ వీధుల్లో భిక్షాటన చేస్తూ 1952 డిసెంబరు 18న మృతి చెందగా, ఇరుగు పొరుగువారి సాయంతో అంత్యక్రియలు నిర్వహించారు.

నేడు ప్రియాగ్రహారంలో వర్ధంతి..

ప్రియాగ్రహారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం గరిమెళ్ల వర్ధంతిని నిర్వహించనున్నట్టు కమిటీ నాయకులు బాడాన రాజు, దుబ్బక కోటేశ్వరరావు, ఇలపండ గణపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు పాఠశాల ప్రాంగణంలోని గరిమెళ్ల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నట్టు చెప్పారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించామని, విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు.



ప్రియాగ్రహారం పాఠశాలలో గరిమెళ్ల సత్యనారాయణ విగ్రహం

ప్లీజ్.. హెల్మెట్ ధరించండి

(ఐదో పేజీ తరువాయి)

తలకు తీవ్ర గాయాలైన చాణక్య అక్కడికక్కడే మరణించాడు. మృతుడికి కొత్తగా వివాహం జరగడంతో ఆ కుటుంబంలో విషాదం చోటు చేసుకుంది.

- వీరంతా హెల్మెట్ ధరించకపోవడం వల్ల నే ప్రాణాలు కోల్పోయారని పోలీసులు నిర్ధారించారు. ఇటువంటి సంఘటనలు జిల్లాలో కోకొల్లలుగా ఉన్నప్పటికీ నేటి యువత మాత్రం హె ల్మెట్ ధరించడానికి ఆసక్తి చూపించడం లేదు.

వినియోగం తక్కువ..

జిల్లాలో ద్విచక్ర వాహనాలు సుమారు 6 లక్షలు ఉంటాయి. ప్రతి నెలా 3వేలకు పైగా ద్విచక్ర వాహనాల అమ్మకాలు జరుగుతున్నాయి. హెల్మెట్ విక్రయాలు మా త్రం 200 నుంచి 300 లోపే ఉంటున్నా యి. దీని బట్టి వాహనదారులు తమ భద్రతపై ఎంత నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థమవుతోంది. హెల్మెట్లు కొనుగోలు చేసి న వారు సైతం వాటిని ఇంట్లో భద్రంగా ఉంచుతున్నారే తప్ప తమ భద్రతకు వాటిని వినియోగించడం లేదు. ఎప్పుడో పోలీసులు కఠినంగా ఆంక్షలు అమలు చేసినప్పుడు తప్ప హెల్మెట్లను ధరించడం లేదు.

యాక్సిడెంట్ జోన్లు గుర్తింపు..

శ్రీకాకుళం నగరంలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ట్రాఫిక్ పోలీసులు ఐదు యాక్సిడెంట్ జోన్లు గుర్తించారు. మిల్లు జంక్షన్, ఏడురోడ్ల కూడలి, డేఅండ్‌నైట్, భైరవానిపేట, రిమ్స్ జంక్షన్ వద్ద స్టాపర్లు ఏర్పాటు చేశారు. అలాగే జిల్లావ్యాప్తంగా ఎక్కడికక్కడ వాహన తనిఖీలు చేసి నిబంధనలు పాటించన వారికి అపరాధ రుసుం వసూలు చేస్తున్నారు. కానీ, చాలామంది హెల్మెట్‌లు ధరించక ప్రమాదాల బారిన పడుతున్నారని పోలీసులు చెబుతున్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి..

ద్విచక్ర వాహనాలు నడిపే వారితో పాటు వెనుక కూర్చునే వారు కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. ప్రమాదాలు జరిగినప్పుడు ఎక్కువగా తలకు బలమైన గాయాలు తగులు తుంటాయి. ఫలితంగా మృతి చెందే ప్రమాదం ఉంటుంది. హెల్మెట్ లేకుండా ప్రయాణించే వారికి వెయ్యి రూపాయలు అపరాధ రుసుం విధిస్తున్నాం. రెండుసార్లు పట్టుబడితే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తాం. మైనర్లు వాహనాలు నడిపితే వారితో పాటు తల్లిదండ్రులకు స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇస్తున్నాం.

-వి.నాగరాజు, ట్రాఫిక్ సీఐ



జగతిమెట్ట జగనన్న కాలనీలో ఇళ్ల పట్టాలు పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

అసలు లబ్ధిదారులు ఉన్నారా?

- ఇతరులు నివసిస్తున్నారా? ● ఖాళీ స్థలాలు ఎన్ని ఉన్నాయి?
- జగనన్న కాలనీలో అక్రమాలపై అధికారుల విచారణ

టెక్కలి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): టెక్కలి జగతిమెట్ట సమీపంలోని జగనన్న కాలనీలో పలు అక్రమాలు చోటుచేసుకున్నట్లు ఫిర్యాదులు అందడంతో అధికారులు విచారణ చేపట్టారు. కొందరు వీఆర్వోలు పాత తేదీలతో రెవెన్యూ అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి, స్థలాలను అమ్మకాలు చేస్తున్నట్లు ఆర్డీవో ఎం.కృష్ణమూర్తికి పలువురు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయన దర్యాప్తుకు ఆదేశించారు. దీంతో తహశీల్దార్ సాదు దిలీప్‌చక్రవర్తి, ఆర్ఐ ఢిల్లేశ్వరరావు నేతృత్వంలో మంగళవారం రెవెన్యూ అధికారులు జగతిమెట్ట జగనన్న కాలనీలో విచారణ చేపట్టారు. లబ్ధిదారులకు కేటాయించిన 394 స్థలాల్లో వారే ఉన్నారా?, ఖాళీ స్థలాలు ఏమేరకు ఉన్నాయి?, ఇతరులు ఎవరైనా కొనుగోలు చేశారా?, అద్దెలకు ఎవరైనా ఉన్నారా? వంటి వివరాలను ఆరాతీశారు. రెవెన్యూ అధికారులు తనిఖీలు చేస్తుండగా ఒకటి, రెండుచోట్ల పలువురు కబ్జాదారులు విషయం తెలుసుకొని పరుగులు పెట్టారు. లబ్ధిదారులకు కేటాయించిన స్థలాల్లో వారు తప్ప ఇతరులు నిర్మాణాలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇలాంటి వారి వివరా లతో జాబితాను సిద్ధం చేస్తున్నారు. ఈ అక్రమాలపై ఇప్పటికే మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విచారణ చేపట్టాలని రెవెన్యూ అధికారులకు ఆదేశించిన విషయం తెలిసిందే.

పేటలో ఆక్రమణల జోరు

- ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు ● పట్టించుకోని అధికారులు

నరసన్నపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నరసన్నపేట పట్టణంలో రోజురోజుకూ ఆక్రమణలు పెరుగుతున్నాయి. అక్రమార్కులు ప్రభుత్వ స్థలాల్లో చిన్నచిన్న పాకలు వేస్తున్నారు. రాత్రి సమయంలో ఆ పాకలను తొలగించి పెద్దపెద్ద నిర్మాణాలు చేపడుతున్నారు. సోమవారం రాత్రి కాలేజీ రోడ్డులో పాకలను తొలగించి వాటి స్థానంలో పిల్లర్లు వేసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఇక్కడ వారణాశి గణేష్‌కుమార్ అనే కూరగాయల వ్యాపారి రాత్రికిరాత్రే నిర్మాణానికి పూనుకున్నాడు. పెద్దపేట, రాజులు చెరువు గట్టు, జగన్నాథపురం తదితర ప్రాంతాల్లో అక్రమ నిర్మానాలు సాగుతున్నాయి. ఈ నిర్మాణాలు కొందరి పంచాయతీ అధికారుల కనుసన్నల్లో జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. స్థానికులు ఫిర్యాదు చేస్తున్నా వారు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. గతంలో పంచాయతీ కార్యాలయంలో పనిచేసి, ఇటీవల బదిలీపై వెళ్లిన కొందరు ఉద్యోగులు మళ్లీ నరసన్నపేట పంచాయతీ కార్యాలయానికి వచ్చారు. వారి అండతో అక్రమ నిర్మాణాలు ఊపు అందుకున్నట్లు విమర్శలు వస్తున్నాయి. పెద్దపేటలో కొందరు ఇళ్ల నిర్మాణం పేరుతో అనుమతులు తీసుకుని వాణిజ్య భవనాలు నిర్మిస్తున్నారు. దీనికి సంబంధించి పంచాయతీ సిబ్బందికి భారీ స్థాయిలో మామూళ్లు అందినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో వాటి నిర్మాణాలకు వారు పచ్చ జెండా ఊపినట్లు తెలుస్తోంది. పెద్దపేట ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఇటీవల చేపట్టిన అక్రమ నిర్మాణాలపై పంచాయతీ అధికారులు కన్నెత్తి చూడడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కాగా, స్థానికుల ఫిర్యాదుతో కళాశాల రోడ్డులోని అక్రమ నిర్మాణాన్ని మంగళవారం పంచాయతీ సిబ్బంది తొలగించారు.



కళాశాల రోడ్డులో ప్రభుత్వ స్థలంలోని నిర్మాణాన్ని తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది



విజేతలకు మెమెంటోలు, ప్రశంసాపత్రాలను అందజేస్తున్న డీఐజీ గోపీనాథ్ జెట్టి, ఎస్పీ మహేశ్వరరెడ్డి

ఐకమత్యానికి క్రీడలే ప్రతీక

- క్రీడా స్ఫూర్తితో మెరుగైన సేవలందించాలి
- విశాఖ రేంజ్ డీఐజీ ● పోలీసు స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

ఎచ్చెర్ల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పోలీసుల ఐకమత్యానికి క్రీడలే ప్రతీకగా నిలుస్తాయని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి అన్నారు. ఎచ్చెర్ల సాయుధ పోలీసు మైదానంలో మూడు రోజుల పాటు జరగనున్న జిల్లా పోలీసు వార్షిక స్పోర్ట్స్, గేమ్స్ మీట్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోలీసులు క్రీడాస్ఫూర్తితో ప్రజలకు మెరుగైన సేవలందించాలని అన్నారు. పోలీసులకు శారీరక సామర్థ్యంతో పాటు మానసిక ఉల్లాసం కూడా అవసరమన్నారు. ఒత్తిడిని తగ్గించేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. ఆరోగ్యంగా ఉంటేనే వృత్తిని మరింత సమర్థంగా నిర్వర్తించగలమన్నారు. చెడు అలవాట్లకు బానిస కాకుండా విధి నిర్వహణలో అంకిత భావం ప్రదర్శించాలన్నారు. ఇలాంటి స్పోర్ట్స్ మీట్‌లతో ఉద్యోగుల్లో స్నేహపూర్వక వాతావరణం నెలకొంటుందన్నారు. అలాగే, సమాజంలో కొత్తగా సంభవిస్తున్న నేరాల నియంత్రణకు అవలంబించే విధివిధానాలను చర్చించుకునే వీలుంటుందని తెలిపారు. గెలుపు, ఓటములు ముఖ్యం కాదని, పోటీల్లో పాల్గొనడమే ప్రధానమని అన్నారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. పోలీసు అధికారులు, సిబ్బంది తమ క్రీడానైపుణ్యాన్ని ఈ పోటీల్లో ప్రదర్శించాలన్నారు. పురుషుల 800 మీటర్ల పరుగు, టగ్‌ఆఫ్‌వార్ పోటీలను డీఐజీ ప్రారంభించి విజేతలకు మెడల్స్, ప్రశంసాపత్రాలను అందజేశారు. పోలీసు జట్లు నిర్వహించిన మార్చ్‌పాస్ట్ ఆహ్వానితులను ఆకట్టుకుంది. క్రీడా స్ఫూర్తితో వ్యవహరిస్తామని, విధులను అంకిత భావంతో నిర్వర్తిస్తామని ప్రతిజ్ఞ చేశారు. శ్రీకాకుళం, టెక్కలి, కాశీబుగ్గ సబ్ డివిజన్స్‌లు, ఆర్మ్ రిజర్వ్, హోంగార్డుల విభాగాలకు చెందిన 5 జట్లు ఈ స్పోర్ట్స్, గేమ్స్ మీట్‌లో పాల్గొన్నాయి. ఏఎస్పీ కేవీ రమణ, డీఎస్పీలు సీహెచ్ వివేకానంద, ఎల్.శేషాద్రి, డి.ప్రసాదరావు, సీఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడి

ఆమదాలవలస, డిసెంబరు 17(ఆంధ్ర జ్యోతి): సస్యరక్షణతోనే అధిక దిగుబడి సాధించవచ్చునని వ్యవసాయశాఖ జేడీ కె.త్రినాథస్వామి అన్నారు. మంగళవారం శ్రీనివాసాచార్యులపేటలోని రైతు సేవా కేంద్రంలో నిర్వహించిన 'పొలం పిలు స్తోంది' కార్యక్రమంలో ఆయన పాల్గొని మా ట్లాడారు. సరైన యాజమాన్య పద్ధతుల్లో సాగు చేస్తే ఆదాయాన్ని పొందవచ్చున న్నారు. కార్యక్రమంలో ఏడీ బగ్గు రజని, ఏవో మెట్ట మోహన్‌రావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి డీఈవో పరామర్శ

కవిటి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): బొర్రపుట్టుగలో విధులు నిర్వహిస్తున్న బి.భారతిపై అగంతకుడు దాడిచేసి గాయపర్చడంతో జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య మంగళవారం భైరిపురం గ్రామానికి వెళ్లి ఆమెను పరామర్శించారు. జరిగిన ఘటనపై ఉపాధ్యాయురాలిని అడిగి తెలుసుకున్నారు. మహిళా ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈయన వెంట ఎంఈవో ధనుంజయ మజ్జి, సమగ్రశిక్ష ఏపీవో నళినీకాంత్ ఉన్నారు.

దాడికి పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలి

పొందూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కవిటి మండలం బొర్రపుట్టుగ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిపై దాడికి పాల్పడిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రశన్న డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులు విధులకు వెళ్లేందుకు భయపడుతున్నారన్నారు.

ఆదర్శ పాఠశాలకు రాష్ట్రస్థాయి పురస్కారం

జి.సిగడాం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఏపీ స్టేట్ కన్జర్వేషన్ విషన్ (ఏపీఎస్‌ఈసీఎం)లో స్థానిక ఆదర్శ పాఠశాల రాష్ట్ర స్థాయి పురస్కారం అందుకున్నట్టు ప్రిన్సిపాల్ అన్నా శామ్యూల్ లెంక మంగళవారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి రూ.20వేలు గెలుచుకున్నట్టు తెలిపారు. ఈ షార్ట్‌ఫిల్మ్‌లో పదో తరగతి విద్యార్థులు వైకుంఠరావు, వరప్రసాద్, ఈశ్వర్, తేజ నటించారన్నారు.

డ్రైవింగ్‌లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అరసవల్లి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్‌లో 19వ బ్యాచ్ శిక్షణకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్సు ఉన్నవారు అర్హులని, శిక్షణకు 19 మందికి మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు పూర్తి వివరాలకు 79897 23505, 73829 23293 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.

నేటి నుంచి క్రీడా పోటీలు

ఎచ్చెర్ల, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): అంతర పాలిటెక్నిక్ ప్రాంతీయ స్థాయి క్రీడా పోటీలు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (శ్రీకాకుళం)లో బుధవారం ప్రారంభమవుతాయని కళాశాల ప్రిన్సిపాల్ బి.జానకిరామయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడు రోజులపాటు జరగనున్న ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లా నుంచి 10 పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు పాల్గొంటారన్నారు. విజేతలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

సకాలంలో సాగునీరందించేలా కృషి చేయండి

● నీటి సంఘాల అధ్యక్షులకు ఎమ్మెల్యే బగ్గు సూచన

నరసన్నపేట/పోలాకి/జలుమూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): వచ్చే ఖరీఫ్ నుంచి సకాలంలో రైతులకు సాగునీరందించేలా డీసీ ఛైర్మన్లు పనిచేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మంగళవారం నరసన్నపేట డీఈఈ, పోలాకి రెవెన్యూ, జలుమూరు వంశధార కార్యాలయాల్లో జరిగిన డిస్ట్రిబ్యూటరీ కమిటీ (డీసీ)ల ఎన్నికల్లో ఎమ్మెల్యే పాల్గొని విజేతలను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతుల సమస్యలను పరిష్కరించడంలో ముందుండాలన్నారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. నరసన్నపేట వంశధార డీసీ అధ్యక్షు డు ఎస్.చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు యాగళ్ల పట్టాబి రామినాయుడు, పోలాకి డీసీ అధ్యక్షుడు మిరియబిల్లి వెంకట అప్పలనాయుడు, ఉపాధ్యక్షుడు మెండ రామ్మోహనరావు, పర్లాం డీసీ కమిటీ అధ్యక్షుడు కింజరాపు సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు పొదిలాపు వేణుగోపాలరావులను అభినందించారు. కార్యక్రమాల్లో వంశధార ఈఈ ప్రదీప్‌కుమార్, డీఈఈ శ్రీహరి, ఎన్.గణేష్, ఏఈ శ్యామలరావు, తహసీల్దార్ ఎం.సురేష్‌కుమార్, టీడీపీ నాయకులు, టీసీలు పాల్గొన్నారు.

● పలాస, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక వంశధార కార్యాలయం ఆవరణలో నీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులుగా గొనప నిరంజన్, అట్టాడ జనార్దన, తారకేశ్వరరావు, దువ్వాడ అప్పారావు, శిష్టు మురళి, దాసరి దాశరధి, కవిటి విశ్వనాథం, అట్టాడ జగన్నాథరావు ఎన్నికయ్యారు. వీరికి నీటి పారుదలశాఖ అధికారులు నియామక పత్రాలు అందించారు. ఏపీటీపీసీ ఛైర్మన్ వజ్జ బాబూరావు మాట్లాడుతూ.. అన్ని నీటి సంఘాలను టీడీపీ మద్దతుదారులు కైవసం చేసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు, అధికారులు పాల్గొన్నారు.

● కోటబొమ్మాళి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): జలుమూరు, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాల పరిధిలోని గోవిందపురం డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడిగా కర్రి అప్పారావు, ఉపాధ్యక్షుడిగా అల్లు రమేష్ కుమార్‌ను మంగళవారం ఎన్నుకున్నారు. స్థానిక వంశధార కార్యాలయ ఆవరణలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నిక నిర్వహించారు. వీరికి ఎన్నికల అధికారి బి.రాంబాబు ధ్రువీకరణ పత్రాలు అందించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజ రాపు హరివరప్రసాద్, పార్టీ నేతలు బోయిన రమేష్ వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు, తర్ర రామక్రిష్ణ తదితరులు అభినందించారు.

● టెక్కలి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): వంశధార పరిధి నౌపడా డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడిగా మళ్ల బాలకృష్ణ, ఉపాధ్యక్షుడిగా సుగ్గు పోతయ్యరెడ్డి మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక వంశధార ఈఈ కార్యాలయంలో ఎన్నికల అధికారి బి.శేఖరరావు నేతృత్వంలో ఎన్నికలు నిర్వహించారు. కార్యక్రమంలో టెక్కలి, నందిగాం టీడీపీ నేతలు బగాది శేషగిరి, పినకాన అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● ఆమదాలవలస, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కొర్లకోట డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడిగా సనపల ఢిల్లేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం కొర్లకోట హైస్కూల్ వ ద్ద సాగునీటిశాఖ ఎస్ఈ పొన్నాడ సుధాకర్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా నెల్లిపర్తి గ్రామానికి చెందిన తొగారం నీటి సంఘం అధ్యక్షుడు దేశిలంక వెంకటరమణను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కొర్లకోట సంఘం అధ్యక్షుడు హనుమంతు బాలకృష్ణ, గుత్తావల్లి నీటి సంఘం అధ్యక్షుడు పొట్నూరు కొండయ్య పాల్గొన్నారు. వీరిని కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, టీడీపీ మండల అధ్యక్షుడు నూక రాజు, నాయకులు తమ్మినేని అమర్నాథ్, అప్పలనాయుడు తదితరులు అభినందనలు తెలిపారు.

● గార, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): అంపోలు డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడిగా శ్రీకూర్మం గ్రామానికి చెందిన వీఎస్ గిరి, ఉపాధ్యక్షుడిగా సింగుపురం మాజీ సర్పంచ్ గుండ మోహన్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అంపోలులో మంగళవారం ఎన్నికలు నిర్వహించిన అధికారులు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు గుండ భాస్కరరావు, మైగాపు ప్రభాకరరావు, గేర సురేష్ కె.ఆదినారాయణ పాల్గొన్నారు.



పోలాకి: అధ్యక్ష, ఉపాధ్యక్షులను అభినందిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

● ఎచ్చెర్ల, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పొన్నాడ డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడిగా మాజీ సర్పంచ్, స్పందన స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పంచిరెడ్డి కృష్ణారావు, ఉపాధ్యక్షుడిగా చిగిలిపల్లి శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పొన్నాడ జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం ఎన్నికల అధికారి, డిప్యూటీ కలెక్టర్ ఎం.లావణ్య పర్యవేక్షణలో ఈ ఎన్నిక జరిగింది. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బెండు మల్లేశ్వరరావు, కూటమి నేతలు పంచిరెడ్డి సత్యనారాయణ, వావిలపల్లి రామకృష్ణ, గోపిన కృష్ణప్రసాద్, నక్క లక్ష్మణరావు, పప్పల వెంకటరమణ, రుప్ప రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను కలుసుకున్న నీటిసంఘాల ప్రతినిధులు

రైతులకు అందుబాటులో ఉండాలి

సోంపేట, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): నీటి సంఘాలకు ఎన్నికైన ప్రతినిధులు రైతులకు అందుబాటులో ఉండి సల హాలు, సూచనలు అందిస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ కోరారు. కొర్లాం నీటిసంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు రాంబుడ్డి జానకిరావు, మద్ది చిరంజీవులు, ఎంజీ పురం నీటి సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందం తదితరులు అశోక్ స్వగృహంలో మంగళవారం కలుసుకున్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మద్దిల నాగేశ్వరరావు, నాయకులు రాంబుడ్డి గణపతి, రత్నాల వెంకటరమణ తదితరులు ఉన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి: డీఐజీ



'సంకల్పం' ఫ్లాష్ మాబ్ నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఎచ్చెర్ల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి అన్నారు. శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం)లో మంగళవారం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సంకల్పం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు సత్ప్రవర్తన కలిగే ఉంటేనే ఉన్నత లక్ష్యాన్ని చేరుకోగలరని చెప్పారు. కళాశాల యాజమాన్యానికి సంకల్పం ఫిర్యాదుల పెట్టె అందజేశారు. అలాగే డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులు నిర్వహించిన ఫ్లాష్ మాబ్ ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, ఏఎస్పీ కేవీ రమణ, డీఎస్పీ వివేకానంద, శివానీ యాజమాన్య ప్రతినిధులు దుర్గా శ్రీనివాస్, దుర్గా ప్రసాద్‌రాజు, ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదుల పెట్టె అందిస్తున్న డీఐజీ, ఎమ్మెల్యే

సఫాయి కర్మచారుల సంక్షేమంపై దృష్టి సారించాలి

● జాతీయ కమిషన్ సభ్యులు పీపీ వావా

శ్రీకాకుళం కలెక్టరేట్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): సఫాయి కార్మికుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలను సక్రమంగా అమలు చేయాలని జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యులు పీపీ వావా జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులు, సఫాయి కార్మికులు, ఆయా సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్వో అప్పారావు, శ్రీకాకుళం మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజు, డీపీవో భారతి సౌజన్య తదితరులు పాల్గొన్నారు. అలాగే అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని పీపీ వావా దర్శించుకున్నారు.



మాట్లాడుతున్న కమిషన్ సభ్యులు వావా

● ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సఫాయి కార్మికులకు ఇటీవల అందజేసిన సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం కార్మికులకు ప్రత్యేక కిట్లను అందజేశారు. ప్రతీ వాహనం రూ.31,67,326ల విలువైనదని ఈ సందర్భంగా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ తెలిపారు.

రైతులకు అవగాహన

ఇచ్ఛాపురం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలు ద్వారా రైస్‌మిల్లులకు పంపించాలని వ్యవసాయ సహాయ సంచాలకులు కె.జగన్‌మోహన్ అన్నారు. మంగళవారం బిర్లంగి తోటూరు గ్రామంలో ఏవో టి.బార్గవి అధ్యక్షతన 'పొలం పిలుస్తోంది' జరిగింది. ఈ సందర్భంగా రబీ పంట ఇన్సూరెన్స్, ధాన్యం కొనుగోలు విధి, విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లు, బీజేపీ జిల్లా మోర్చా అధ్యక్షురాలు మంగి లక్ష్మి పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ



పతకాలతో కరాటే క్రీడాకారులు

రణస్థలం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఇటీవల విశాఖలో జరిగిన ఇంటర్ స్కూల్ రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో మండల కేంద్రానికి చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఆంధ్రా వర్సిటీ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ పోటీల్లో రణస్థలానికి చెందిన 15 మంది గోల్డ్ మెడల్, నలుగురు సిల్వర్ మెడల్, ముగ్గురు బ్రాంజ్ మెడల్ సాధించారు.

లక్ష్యాలు సాధించాలి

శ్రీకాకుళం రూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి లక్ష్యాలను సాధించి ఆంధ్రరాష్ట్రాన్ని నెంబర్ వన్‌గా నిలుపుదామని పీఆర్ అండ్ ఆర్‌డీ కె.సూర్యనారాయణ, శిక్షణ స్టేట్ అబ్జర్వర్ నాగరాజులు అన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై నాలుగు రోజుల శిక్షణలో భాగంగా రెండో రోజు మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో బి.శైలజ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు కొనసాగాయి. ఈ సందర్భంగా వారు కేంద్ర, రాష్ట్ర పథకాలపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ నిర్మల, ఈవోపీఆర్డీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వర్మీ కంపోస్టు తయారీకి సహకారం

అరసవల్లి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): వర్మీ కంపోస్టు తయారీ భావితరాలకు ఎంతో ఉపయోగకరమని, ఇందుకు తమవంతు సహాయ సహకారాలు అందజేస్తామని జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.సుధ అన్నారు. ఖాదీ, గ్రామీణ పరిశ్రమల పీఎంఈజీపీ పథకంలో మంజూరైన వర్మీకంపోస్టు పరిశ్రమల క్లస్టర్ సమావేశం నగరంలో గల ఖాదీ, గ్రామీణ పరిశ్రమల డిజిటల్ కార్యాలయంలో మంగళవారం జరిగింది. కార్యక్రమంలో క్లస్టర్ అధ్యక్షుడు గురుగు లక్ష్మీనారాయణ, కార్యదర్శి జి.సుమ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ డ్రైవ్‌ను వినియోగించుకోండి

కంచిలి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్పెషల్ ఆధార్ డ్రైవ్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వి.తిరమలరావు అన్నారు. మంగళవారం డీజీ పురం, పోలేరు సచివాలయాల్లో జరుగుతున్న ఆధార్ స్పెషల్ డ్రైవ్‌ను పరిశీలించారు. అనంతరం పాలేరు అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు.

శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డుకు నిధులు

అరసవల్లి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కీలకమైన శ్రీకాకుళం - ఆమదాలవలస రోడ్డుకు నిధులు మంజూరయ్యాయి. గత వైసీపీ హయాంలో చెల్లింపులు జరగక ఈ రోడ్డు నిర్మాణం పనులు ఆగిపోయాయి. ఈ రోడ్డులో ప్రయాణిస్తూ ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. శ్రీకాకుళం ఎమ్మెల్యేగా గొండు శంకర్ గెలుపొందిన తర్వాత ఈ రోడ్డును ఎలాగైనా పూర్తిచేయాలనే పట్టుదలతో చేసిన కృషి ఫలించింది. గతంలో ఈ రోడ్డు నిర్మాణానికి రూ.6కోట్లు అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, తాజాగా మరో రూ.10కోట్లు మంజూరు చేయడంతో జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎమ్మెల్యే శంకర్ కృతజ్ఞతలు తెలిపారు. ఇంజినీర్లు, కాంట్రాక్టర్లు ఇబ్బంది పడవద్దని, అందరికీ బిల్లులు చెల్లిస్తామని, రోడ్డు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.

కేంద్రమంత్రి జన్మదిన వేడుకలు జయప్రదం చేయండి

అరసవల్లి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): సిక్కోలు ముద్దుబిడ్డ, జిల్లా ఖ్యాతిని దేశవ్యాప్తంగా ఇనుమడింపజేసిన కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు జన్మదిన వేడుకలను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం 10.00 గంటలకు స్థానిక ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో నిర్వహిస్తున్నామని, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నియోజకవర్గం నలుమూలల నుంచి తరలిరావాలని కోరారు. అలాగే గార మండలం, రూరల్ మండలం, శ్రీకాకుళం నగరంలో స్థానిక నాయకులు వారి వారి ప్రాంతాల్లో జన్మదిన వేడుకలు నిర్వహించి, ఉదయం 10.00 గంటలకు ఏడు రోడ్ల కూడలికి చేరుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

బోర్లు బాగు చేయరా?

ఇచ్ఛాపురం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధి పురుషోత్తపురం-1, 2 వార్డుల పరిధిలో గల కాలనీలో బోర్లు పాడయ్యాయని వాటి బాగు చేయాలని గత కౌన్సిల్ సమావేశంలో విన్నవించినా పట్టించుకోరా? అంటూ 1వ వార్డు కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్‌కుమార్ అధికారలను ప్రశ్నించారు. మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ఛైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అధ్యక్షతన అత్యవసర సమావేశం జరిగింది. అజెండాలో పొందిపరిచిన మూడు అంశాలుపై చర్చించారు. అనంతరం జీర్ అవర్‌లో పలు సమస్యలపై చర్చించారు. సమావేశంలో మేనేజర్ అప్పలరాజు, వైస్ ఛైర్‌పర్సన్ స్వర్ణమణి, కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

నాటిక పోటీలు

శ్రీకాకుళం కల్చరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ముత్యాలమ్మ కళాపరిషత్ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో వచ్చే ఏడాది ఫిబ్రవరి 9,10,11 తేదీలలో బాపూజీ కళామందిర్‌లో నాటిక పోటీల ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు కేతిరెడ్డి రాజే శ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9440437136 నెంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోగలరని ఆ ప్రకటనలో తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి

ఇచ్ఛాపురం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): యువత సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పట్టణ ఎస్ఐ చిన్నమనాయుడు అన్నారు. మంగళవారం 10వ వార్డు జాలారవీధిలో ప్రజలకు సైబర్ క్రైం, ఉమెన్ సేఫ్టీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహి ళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

● గార, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఆర్.జనార్దనరావు అన్నారు. మంగళవారం రాత్రి కోళ్లపేట గ్రామంలో నిర్వహించిన సంకల్పం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామస్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పట్టణ ఎస్ఐ చిన్నమనాయుడు

నిధులు వృథా.. ప్రజలకు వ్యధ

● నిలువ నీడలేని కూడళ్లు



నర్సింగపురం వద్ద మొండిగోడలతో..



బుడంబో రామకృష్ణాపురం వద్ద..

హరిపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రయాణి కుల సౌకర్యార్థం లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన విశ్రాంతి భవనాల నిర్మాణం అర్ధంతరంగా నిలిచి పోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ప్రజాధనం వృథా కావడంతో పాటు నిరుపయోగంగా తయారయ్యాయి. మందస మండలంలోని పలు రోడ్డు కూడళ్ల వద్ద దుస్థితి ఇది. సాబకోట రోడ్డులో బుడంబో రామ కృష్ణాపురం వద్ద రూ.2 లక్షలతో నిర్మిస్తున్న విశ్రాంతి భవనం పనులు నిలిపివేశారు. దీంతో భవనం ప్లేట్లు, ఇటుకలు రాలి పడుతున్నాయి. దేవుపురం రోడ్డులో నర్సింగపురం వద్ద రూ.2.5 లక్షలతో నిర్మించిన భవనం ఏడాదిగా మొండి గోడలతో దర్శనమిస్తోంది. చిక్కిడగాం కూడలిలో రూ.3 లక్షలతో నిర్మించిన భవనం నిరుపయోగంగా ఉంది. భవనాలు ఉపయోగంలో లేకపోవ డంతో ఆయా ప్రాంత ప్రయాణికులు, వాహన చోదకులు వేచి ఉండేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మం దస రైల్వేస్టేషన్, కొండలోగాం, రామరాయి, బంసుగాం తదితర ప్రాంతాల్లో ప్రయాణికులకు నిలువ నీడలేని పరిస్థితి ఎదురవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ భవనాలకు మరమ్మతులుచేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనచోదకులు కోరుతున్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ మహిళ మృతి



భవాని (ఫైల్)

నరసన్నపేట, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక జోగిపేటకు చెందిన నారాయణశెట్టి భవాని (42) శ్రీకాకుళంలో ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మంగళవారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. భవాని తన భర్త శ్రీధర్‌తో కలిసి ఈనెల 15న పోలాకి మండలం రాజారాంపురం పిక్నిక్ వెళ్లి తిరుగు ప్రయాణంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో వాహనం వెనుక కూర్చొన్న భవానీకి తలపై బలమైన గాయాలయ్యాయి. వెంటనే శ్రీకాకుళంలో ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందారు. ఈమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. భవాని మృతి చెందిన విషయం తెలుసుకుని బంగారం వర్తకులు షాపులను మూసివేసి సంతాపం తెలిపారు. భవాని మృతిపై పోలాకి పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జె.శ్రీనివాసరావు తెలిపారు.

రిమ్స్‌లో రైతు కూలి..

జలుమూరు, డిసెంబరు 17: (ఆంధ్రజ్యోతి): పర్లాం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలి కొరికాన కృష్ణారావు (53) పురుగుల మందు తాగి మంగళవారం రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మద్యానికి బానిసైన కృష్ణారావుని భార్య పిల్లలు విడిచిపెట్టి నెల్లూరులో జీవనం సాగిస్తున్నారు. భార్య పిల్లలు తనతో లేకపోవడంతో మనస్తాపం చెంది సోమవారం సాయంత్రం పొలంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సోదరుడు అప్పలస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ రాజశేఖర్ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి..



బస్‌షెల్టర్‌లో మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి

పలాస, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పలాస మండలం కొబ్బరిఊరు గ్రామ బస్ షెల్టర్ వద్ద మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి మృత దేహాన్ని కాశీబుగ్గ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుడి షర్టుపై క్లీన్ టైలర్స్ సేలం అని రాసి ఉంది. ఆయనకు చెందిన వ్యక్తులు ఎవరైనా ఉంటే కాశీబుగ్గ పోలీసులకు సమాచారం అందించాలని సీఐ డి.మోహనరావు కోరారు.

ముద్దాడపేటకు చెందిన ఎర్రయ్య..



ఎర్రయ్య (ఫైల్)

ఆమదాలవలస, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ముద్దాడపేట గ్రామానికి చెందిన ఎర్రయ్య (40) సోమవారం రాత్రి రాగోలు జెమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. శనివారం మధ్యాహ్నం ఆమదాలవలస నుంచి పని ముగించుకొని ఇంటికి వస్తుండగా.. ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనంలో రాగోలు జెమ్స్‌కి తరలించారు. ఎర్రయ్యకు భార్య దుర్గ, కుమార్తె జస్మిత, కుమారుడు జ్ఞానేశ్వర్ ఉన్నారు.

చిననడిపల్లికి చెందిన వ్యక్తి..

లావేరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): బెజ్జిపురం జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన కుప్పిలి విక్రమ్‌సాయి చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్టు హెచ్‌సీ జోగారావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 9న బుడుమూరు సంత నుంచి స్వగ్రామమైన విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం చిననడిపల్లికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా రణస్థలం వైపు నుంచి బుడుమూరు వైపు వెళ్తున్న వ్యాన్ ఢీకొంది. దీంతో విక్రమ్‌సాయి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం రాగోలు జెమ్స్ ఆసుపత్రిలో చేర్పించగా, మంగళవారం మృతి చెందాడు. సాయి సోదరుడు కుప్పిలి సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

సారా ప్యాకెట్లు స్వాధీనం

కంచిలి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): 36 లీటర్ల సారా ప్యాకట్లు స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ బేబి తెలిపారు. మంగళవారం పద్మతుల జంక్షన్ వద్ద తనిఖీలు చేస్తుండగా ద్విచక్ర వాహనంపై సారాప్యాకెట్లతో వస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించా మన్నారు.

కాకర్ల చెరువులో ఆక్రమణల తొలగింపు



చెరువు ఆక్రమణలు తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు, పోలీసులు

జలుమూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): చిన్నదూగాం గ్రామంలోని కాకర్ల చెరువు ఆక్రమణలను మంగళవారం రెవెన్యూ అధికారులు తొలగించారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు జిల్లా అధికారులు ఆదేశాలతో పోలీసుల సాయంతో రెవెన్యూ అధికారులు తొలగించారు. చిన్నదూగాం సర్వేనెం.48/1 సర్వే నెం.59లలో కాకర్ల చెరువు భూములను ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జన్ని రామారావు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ తర్ర నాగేశ్వరరావు, డీటీ మధుబాబు, ఆర్ఐ కిరణ్, నరసన్నపేట సీఐ శ్రీనివాసరావు, జలుమూరు, నరసన్నపేట, సారవకోట, పోలాకి ఎస్ఐలు అశోక్‌బాబు, దుర్గాప్రసాద్, అనిల్‌కుమార్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా పనిచేస్తే ఉండండి.. లేకుంటే తప్పుకోండి

పోలాకి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో ఉపాధి హామీలో సిబ్బంది సక్రమంగా పనిచేయాలని లేకుంటే విధులనుంచి తప్పుకోవాలని డ్వామా పీడీ బి.సుధాకర్ ఆదేశించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉపాధి హామీ సామాజిక ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పనులన్నింటిలో మస్టర్ల దిద్దుబాట్లు, ఫిర్యాదులు, పనులు కల్పించాలని ప్రజల వినతులను పరిశీలించి ఏపీవో ఈసీ,టీసీల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పునరావృతమైతే చర్యలు తప్పవని స్పష్టంచేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో గరిమెళ్ల రవికుమార్, ఏపీడీ రాధ, ఎస్ఆర్పీ పున్నమినాయుడు, ఏపీవో రమణ, ఈసీ నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ

నరసన్నపేట, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో చేపట్టిన సీసీ రోడ్డు పనుల్లో నాణ్యతా పాటించకుంటే సంబంధిత ఇంజనీరింగ్ అధికారులపై చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ బి.సుధాకరరావు అన్నారు. మంగళవారం పట్టణంలో చేపట్టిన పలు సీసీ రోడ్లు, కాలువ పనులను పరిశీలించారు. సీసీ రోడ్లు క్యూరింగ్ చేపట్టడంతో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దన్నారు. కొందరు నామమాత్రంగా క్యూరింగ్ చేస్తున్నారని, అలాగే రోడ్డు వేయడంలో నిబంధనలు అతిక్రమించడం జరుగుతుందన్నారు. ఇది పద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో డ్వామా ఏపీవో యుగంధర్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

వడ్డివాడ రైల్వేగేటుపై ఫ్లై ఓవర్ బ్రిడ్జి మంజూరు

సంతబొమ్మాళి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోరుభద్ర-వడ్డివాడ మార్గంలో వడ్డివాడ రైల్వే గేటుపై ఫ్లై ఓవర్ బ్రిడ్జి మంజూరు చేస్తూ రైల్వేశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గజిట్ నోటిఫి కేషన్‌ను ఈస్ట్‌కోస్టు రైల్వే చీఫ్ ఇంజనీర్ అజయ్ కుమార్ సామల్ విడుదల చేశారు. మండలంలోని బోరుభద్ర, మలగాం, కొల్లి పాడు, లక్కివలస, మేఘవరం, పాలతలగాంతో పాటు పోలాకి మండలాలకు చెందిన వేలాది మంది నిత్యం ఈ రైల్వేగేటు మీదుగా సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, నౌపడ, పలాస, టెక్కలి, కోటబొమ్మాళి రైల్వేస్టేషన్‌లకు ప్రయాణాలు సాగిస్తుంటారు. రైల్వేగేటు వద్ద ఆటోలాక్ సిస్టం కావడంతో ఇటు నౌపడ, అటు హరిశ్చంద్రపురంలో రైలు ఉన్నప్పుడే రైల్వేగేటు వేసేస్తుండంతో చాలా సమయం వరకు వాహనదారులు వేచి ఉండాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. అనేక పర్యాయాలు గంటల తరబడి ట్రాఫిక్‌తో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. దీంతో సమస్యను జిల్లా ఎంపీ, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు కేంద్ర రైల్వే శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో ఫ్లై ఓవర్ బ్రిడ్జిని మంజూరు చేస్తూ గజిట్ విడుదల చేశారు. ఫ్లైఓవర్ మంజూరుతో ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయని తీరప్రాంత వాసులు, వాహన చోదకులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

మేస్త్రీ కుమారుడు.. మూడు కొలువులకు ఎంపిక



తల్లిదండ్రులతో గణేష్

టెక్కలి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): టెక్కలి ఎన్టీఆర్ కాలనీకి చెందిన పైల గణేష్ సీఆర్ పీఎఫ్, ఎస్ఎస్‌సీ, ఇండియన్ నేవీలకు ఒకేసారి మూడు ఉద్యోగాలకు ఎంపిక య్యాడు. తండ్రి రాము టెక్కలిలో తాపీమేస్త్రీగా ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. చిన్నప్పటి నుంచి అద్దె ఇంట్లో ఉంటూ కుమారుడిని చదివించడంతో అతడు ప్రతిభ కనబరిచి మూడు ఉద్యోగాలకు ఎంపిక య్యాడు. కుమారుడి ప్రతిభకు తల్లిదండ్రులు రాము, ప్రమీల ఆనందం వ్యక్తంచేసి అభినందించారు.

కోతుల బెడదతో ఇబ్బందులు

టెక్కలి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): గూడెం గ్రామంలో మంగళవారం కోతులు హల్‌చల్ చేశాయి. ఒక్కసారిగా కోతులను చూసిన గ్రామస్థులు ఆందోళన చెందారు. పొలాలకు వెళ్లేవారు, వ్యవసాయ పనులకు వెళ్లే కార్మికులు కోతులను చూసి ఎక్కడ ఎవరిపై దాడి చేస్తాయోనని ఆవేదనకు గురయ్యారు. కోతల విషయాన్ని అటవీ శాఖ అధికారులకు స్థానికులు సమాచారం అందజేశారు. అయితే కోతులకు కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని, దాడులు చేయవద్దని అటవీ అధికారులు సూచించారు. ఈ కోతులు సాయంత్రం గూడేం తోటల్లోకి చేరుకున్నాయి.



గూడెంలో సంచరిస్తున్న కోతులు

పెన్షనర్ల హక్కుల పరిరక్షణ బాధ్యత ప్రభుత్వాలదే..



టెక్కలి: మాట్లాడుతున్న ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ రవికుమార్

అరసవల్లి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రిటైర్డు ఉద్యోగుల హక్కుల పరిరక్షణ బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదేనని జాతీయ పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దొంతం పార్వతీశం, మణికొండ ఆదినారాయణ మూర్తి అన్నారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో మంగళవారం 'పెన్షనర్స్ డే' నిర్వహించారు. ఈపీఎస్ పెన్షనర్లకు కనీస పింఛన్ రూ.9వేలు ఇవ్వాలని, ఉద్యోగ విరమణ సమయంలో ఉద్యోగులకు జాప్యం లేకుండా చెల్లింపులు చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగులు పాల్గొన్నారు.



అరసవల్లి: మాట్లాడుతున్న పెన్షనర్ల అసోషియేషన్ అధ్యక్షుడు దొంతం పార్వతీశం

ఘనంగా పెన్షనర్ల దినోత్సవం

టెక్కలి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): జాతీయ పెన్షనర్ల సంఘ దినోత్సవాన్ని స్థానిక కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు రోణంకి రామచంద్రరావు అధ్యక్షత వహించగా, టెక్కలి సబ్ ట్రెజరీ అధికారి వి.రామకృష్ణారావు, ఎస్టీవో ఎం.భాగ్యలక్ష్మి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ ఎం.రవికుమార్ పెన్షనర్లకు సంబంధించిన అంశాలపై మార్గదర్శకాలు వివరించారు. పెన్షనర్ల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పలువురు సీనియర్ పెన్షనర్లను సత్కరించారు. కార్య క్రమంలో బొడ్డ అయ్యబాబు, గుజ్జు వెంకట్రావు, రెయ్యి పున్నయ్య, లక్ష్మీనారాయణ, కామేశ్వరరావు, మూల తాతయ్య, నాగేశ్వరరావు, వల్లభ మల్లయ్య, చిట్టెన్న, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి



రణస్థలం: మంత్రికి సమస్యలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

నియోజకవర్గాల్లోని పలు సమస్యలను ఎమ్మెల్యేలు మామిడి గోవిందరావు, గొండు శంకర్, నడుకుదిటి ఈశ్వరరావు మంత్రి సత్య ప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. విశాఖపట్నం కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో వారు పాల్గొన్నారు. ఆ వివరాలిలా..

భూమిని కేటాయించాలి: ఎంజీఆర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పాతపట్నం నియోజకవర్గపరిధిలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు భూమిని కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు రెవెన్యూ శాఖా మంత్రి సత్య ప్రసాద్‌ను కోరారు. మంగళవారం విశాఖ పట్నం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన రెవెన్యూ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన నియోజకవర్గం పాతపట్నం అని, ఆ స్థితి నుంచి మార్పు తీసుకువచ్చేందుకు ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీ పేరిట జరిగిన అవినీతి వల్ల విలువైన ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయని, దీనిపై విచారణ చేపట్టాలని కోరారు. పాతపట్నంలోని ఎర్రచెరువు 174-1సర్వే నెంబర్ గ్రామకంఠం ఆక్రమణలను సమావేశంలో ప్రస్తావించారు. పాతపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడాస్థలం ఆక్రమణలకు గురైందని, బాధ్యులపై చర్యలు తీసుకుని భూమిని రక్షించాలని కోరారు. వంశధార నిర్వాసితుల సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రైతు సమస్యలను పరిష్కరించండి: ఎన్ఈఆర్

రణస్థలం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల నియోజకవర్గంలో రైతులు ఇబ్బంది పడుతున్న భూ సమస్యలను రాష్ట్ర రెవెన్యూ మంత్రి సత్యప్రసాద్ దృష్టికి ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు తీసుకెళ్లారు. మంగళవారం విశాఖలో జరిగిన రీజనల్ రెవెన్యూ అధికారుల కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు వివరించారు.

రెండు మండలాలుగా విభజించాలి: శంకర్

అరసవల్లి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రెవెన్యూ మండలంలో పనిభారం అధికంగా ఉండడం వల్ల అర్బన్, రూరల్ మండలాలుగా విభజించాలని రెవెన్యూ మంత్రి సత్యప్రసాద్‌కు ఎమ్మెల్యే గొండు శంకర్ వినతిపత్రం అందజేశారు. మంగళవారం విశాఖలో నిర్వహిస్తున్న రెవెన్యూ సమావేశంలో పాల్గొన్న మంత్రిని ఎమ్మెల్యే కలిసి వివరించారు. అలాగే మొగదాలపాడును రెవెన్యూ గ్రామంగా మార్చాలని కోరగా.. మంత్రి సానుకూలంగా స్పందించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. ఎల్‌పీఎం నెంబర్ల కోసం రైతుల నుంచి రూ.550 వసూలు చేస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకురాగా, ఎల్‌పీఎం నెంబర్ల కోసం రైతులు ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని, రైతులకు పూర్తి ఉచితంగా ఇస్తామని చెప్పినట్టు తెలి పారు.



అరసవల్లి: సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్, చిత్రంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష

మిల్లు కార్మికుల సమ్మెకు సహకరించండి



తహసీల్దార్ కల్యాణచక్రవర్తికి సమ్మె నోటీసు అందిస్తున్న కార్మికసంఘ నాయకులు

పలాస, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): వేతన ఒప్పందాలపై మిల్లర్లతో రెండు పర్యాయాలు చర్చించినా ఫలితం కనిపించలేదని, అందువల్ల ఈనెల 26న అర్ధరాత్రి నుంచి సమ్మెకు దిగుతున్నామని, సహకరించాలని కార్మిక సంఘ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి కోరారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ టి.కల్యాణ చక్ర వర్తిని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి రెండేళ్లకు ఒకసారి వేతనాలను పెంచాల్సి ఉందని, అయితే గడువు పూర్తయినా నేటికీ మిల్లర్లు స్పందించడం లేదన్నారు. ఇదే విషయమై రెండు పర్యాయాలు సంబంధిత మిల్లర్ల సంఘం నేతలతో చర్చలు జరిపామని, అప్పుడే ఈనెల 26 లోగా పరిష్కరించకుంటే సమ్మెకు దిగుతామని తెలియజేశామన్నారు. అయితే ఇప్పటి వరకు వారి నుంచి ఎటు వంటి స్పందన రాలేదన్నారు. అందువల్ల అధికారులకు సమ్మెపై వినతిపత్రం అందిస్తున్నామన్నారు. కార్మికుల ఆందోళనపై వ్యాపారులు సానుకూలంగా స్పందిస్తారన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

స్వామి సేవలో సంపూర్ణేష్‌బాబు



కూర్మనాథుని చిత్రపటాన్ని అందిస్తున్న గురునాథరావు

అరసవల్లి/గార, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు సంపూర్ణేష్‌బాబు మంగళవారం అరసవల్లి, శ్రీకూర్మం ఆలయాలను సందర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అరసవల్లి సూర్యనారాయణ స్వామిని, శ్రీకూర్మనాథుని కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. వారికి అర్చకులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు. స్వామివారి ప్రసాదం, జ్ఞాపికను ఈవో గురునాథరావు, ఆదిత్యాలయ సీనియర్ అసిస్టెంట్ శోభనాద్రాచార్యులు అందజేశారు. అర్చకులు ఇప్పిలి సాందీపశర్మ, ఇప్పిలి రంజిత్‌శర్మ, సీతారామ నరసింహాచార్యులు వారికి ఆశీర్వచనం చేశారు.

న్యూస్ బాక్స్

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

నందిగాం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కాపుతెంబూరు ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ పోలాకి లక్ష్మీ నారా యణ అక్రమాలకు పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదులపై టెక్కలి ఏపీడీ శైలజ మంగళవారం విచారణ చేప ట్టారు. స్థానిక సచివాలయం ఆవరణలో ఫిర్యాదుదారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామస్థులను విచారించి స్టేట్ మెంట్లను తీసుకున్నారు. ఫీల్డ్‌అసిస్టెంట్ అక్రమా లకు సంబంధించి ఐదు అంశాలపై పీడీకి ఫిర్యాదు చేయ డంతో ఆయన ఆదేశాల మేరకు ఈ విచారణ చేపట్టినట్లు ఆమె తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీవో నాగరాజు, స్థానిక నాయకులు కొల్లి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం కార్యవర్గ ఎన్నిక

మందస,డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మందస మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నెయ్యిల మోహనరావు, ఉపాధ్యక్షులుగా కె.కూర్మారావు, బమ్మిడి నవీన్‌కుమార్, ప్రధాన కార్యదర్శులుగా డి.కల్పన, సంపతి జ్ఞానేశ్వరి, కోశాధికారులుగా బలగ అరుణ, కె.సహజ ఎన్నికయ్యారు. అలాగే వర్కింగ్ ప్రెసిడెంట్లుగా ఎం.సోమేష్, బి.ఈశ్వరరావు, జి.పద్మావతి, ఎస్.మనోజ్ కుమార్, ఆర్గనైజర్‌గా డి.రవిశంకర్, ప్రధాన సలహాదారుగా కుప్పిలి జయప్రకాశ్ ఎన్నికయ్యారు.

డీఎస్పీ కార్యాలయం సందర్శించిన డీఐజీ

టెక్కలి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): టెక్కలి డీఎస్పీ కార్యాలయాన్ని మంగళవారం సాయంత్రం విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి సందర్శించారు. రికార్డులు పరిశీలించి వివిధ అంశాలపై డీఎస్పీ డీఎస్ఆర్వీ ఎస్ఎన్‌మూర్తితో చర్చించారు. ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతమైనందున ప్రత్యేక నిఘాతో పాటు అప్ర మత్తంగా ఉండాలని డీఐజీ సూచిచారు. ఆయనతో పాటు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఉన్నారు.

జాతీయ ఖోఖో పోటీలకు తిరుమలరావు ఎంపిక



పలాస, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అయోధ్యలో ఈనెల 21 నుంచి 24 వరకు జరగ నున్న 68 జాతీయ స్కూల్ గేమ్స్ ఖోఖో పోటీలకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి బడే తిరుమల ఎంపికయ్యాడు. జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యాడు. జిల్లా నుంచి జాతీయ స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న తిరుమలరావును హెచ్‌ఎం డి.దాశరథి, పీఈటీలు పి.తవిటయ్య, బి.శంకరరావు, ఆర్.శ్రీనివాసరావులతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

గ్రామీణాభివృద్ధికి తోడ్పడాలి: జడ్పీ సీఈవో



మాట్లాడుతున్న జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా

నరసన్నపేట, డిసెంబరు 17: గ్రామీణాభివృద్ధికి సచివాలయ సిబ్బంది తోడ్పడాలని జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గ్రామీణాభివృద్ధిపై సర్పంచ్‌లు, సచివాలయ అధికారులకు ఇస్తున్న శిక్షణలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను వినియోగిస్తూ గ్రామీణాభివృద్ధికి బాటలు వేయాలన్నారు. వృత్యంతర శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బి.మధుసూదనరావు, ఈవోఆర్డీవో రేణుక, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఒడిశా

రక్తదానం ప్రాణదానంతో సమానం: కలెక్టర్



రక్తదాతలకు సర్టిఫికేట్లు అందిస్తున్న కలెక్టర్

పర్లాకిమిడి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని కలెక్టర్ విజయ్ కుమార్ దాస్ అన్నారు. మంగళవారం పర్లాకిమిడి సమీపంలోని సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానం చేయడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడవచ్చన్నారు. యువత రక్తదానంలో భాగస్వామ్యం కావాలని కోరారు. డాక్టర్ సభాన పర్వీన్ నేతృత్వంలో యువత నుంచి 70 యూనిట్లు రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో సెంచూరియన్ వర్సిటీ రిజిస్ట్రార్ అనితా పాత్రో, అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ దుర్గా ప్రసాద్‌పాడి, డీన్ అడ్మినిస్ట్రేషన్ ఎస్‌పి నందా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు

పర్లాకిమిడి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): గజపతి జిల్లా గుమ్మ సమితి నేరంగో గ్రామంలో బెతానీ బంగ్లా లో సౌర బాప్టిస్ట్ క్రిస్టియన్ మండలి సమ్మేళనం భవనంలో ప్రీ క్రిస్మస్ వేడుకలు మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే రూపేష్ కుమార్ పాణిగ్రాహి ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి క్రీస్తు సందేశాన్ని వివరించారు. ప్రతీ ఒక్కరూ ప్రేమ, కరుణ సామరస్య విలువలు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల నుంచి పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.